మిర్చి.. నష్టాల ఘాటు



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు కొండయ్య. లక్ష్మక్కకండ్రిగ గ్రామం. ఒక్క ఎకరాలో ప్రియాంక రకం మిర్చి సాగు చేశాడు. ఎకరాకు రూ.2 నుంచి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. గత ఏడాది టన్ను పచ్చిమిర్చి ధర రూ.28 వేల నుంచి రూ.30వేల వరకు పలికింది. ఈ ఏడాది మాత్రం నాణ్యత కలిగిన మిర్చి టన్ను రూ.13 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే పలుకుతుండడంతో ఆందోళన చెందుతున్నాడు. ఎకరాకు 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు కూలీల కోసం రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. అన్నీ లెక్కలు వేసుకుని కనీస పెట్టుబడి కూడా రాకపోగా ఎకరాకు రూ.1 లక్ష వరకు నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రేటు పెరిగితేనే పంటను కోస్తానని లేదంటే పొలంలోనే వదిలేస్తానంటున్నాడు.

- ధర లేక మిర్చి రైతు దిగాలు
- ఈ ఏడాది తీవ్ర నష్టాలు
- పెట్టుబడి అప్పులు కూడా తీర్చలేమంటున్న రైతులు

కోట: ఆరుగాలం శ్రమించి మిర్చి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది ధరలు పతనావస్థకు చేరడంతో కన్నీళ్లు వస్తున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. సాగులో కష్టాలను ఎదుర్కొన్నారు. నీటి ఎద్దడి, తెగుళ్ల సమస్యలను అధిగమించి పంట పండించినా చివరకు కోతకు వచ్చే సమయానికి ధరలు లేక పోవడంతో రైతులు కుమిలిపోతున్నారు.



తిన్నెలపూడిలో మిరపసాగు

నష్టాల ఘాటు

నియోజకవర్గంలోని గూడూరు,కోట,చిట్టమూరు మండలాల్లో మిరపపంట సాగు చేస్తారు.మండలంలో తిన్నెలపూడి,లక్ష్మక్కకండ్రిగ,చెందోడు,చిట్టేడు, రుద్రవరం,కేసవరం గ్రామాల పరిధిలో రైతులు మిర్చి సాగు చేశారు. ఈ ఏడాది మిర్చి ధరలు పతనమై పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో టన్ను పచ్చిమిర్చి ధర రూ.30 వేల వరకు పలికింది. వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి మిర్చిని కొనుగోలు చేసి చెన్నై, బెంగళూరు మార్కెట్‌లకు తరలించేవారు. దీంతో రైతులు లాభాలు గడించారు. నాలుగు రూపాయలు వెనకేసుకున్నారు. ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా పెంచారు. అధికంగా పెట్టుబడులు పెట్టారు. మిర్చి ధరలు తగ్గిపోవడంతో ఎకరాకు రూ.2 లక్షలపైనే పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ధరలు సగానికి పైగా పడిపోవడంతో ప్రస్తుతం ఎకరానికి రూ.లక్షపైనే నష్టపోతున్నారు. లాభాలు కాదుకదా.. కనీసం పెట్టుబడి, కూలీ ఖర్చులు కూడా రాక విలవిల్లాడుతున్నారు.



మిరపను బస్తాలకు నింపుతున్న రైతులు

ఇక మిర్చి సాగు చేయలేం



మిర్చి ధరలు ఇంతలా ఎప్పుడూ తగ్గిన దాఖలాలు లేవు. తగ్గిన ధరలు వింటేనే భయమేస్తుంది. ఇంటిల్లిపాది కష్టపడి పనిచేసి సేద్యం చేసినా చివరకు కూలీ ఖర్చులకు కూడా రావడం లేదు. పెట్టిన పెట్టుబడి తీర్చడానికి అప్పులు చేయాల్సి వస్తుంది. ఇంక మిర్చి సాగు చేయలేం.

\- శివ, మిర్చి రైతు, తిన్నెలపూడి

ప్రభుత్వం ఆదుకోవాలి



మిర్చి సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఇతర పంటల్లాగే మిరప పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించాలి. గత ఏడాది ధరలు చూసి ఆశపడి సాగు చేసిన రైతులు నష్టపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర కల్పించాలి.

\- దినకర్, మిర్చి రైతు, తిన్నెలపూడి

90 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



అన్నమేడులో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు

నాయుడుపేట టౌన్: అన్నమేడు గ్రామంలో జరుగుతున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో 90 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసినట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. గత నెల 26వ తేదీ నుంచి గ్రామంలో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం నాటికి 400 మందికి పైగా కంటి పరీక్షలను నిర్వహించినట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు చిగురువాడ పద్మనాభం వెల్లడించారు. వీరిలో 90 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. వీరందరికీ చెన్నై నుంచి తీసుకొచ్చిన అధునిక వైద్య వసతులు కలిగిన ప్రత్యేక బస్సులో అన్నమేడు గ్రామంలోనే 2 నుంచి 6వ తేదీ వరకు కంటి శస్త్ర చికిత్సలు చేయించినట్లు వివరించారు. అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయులు కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి దంపతుల సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం చేపట్టినట్లు వివరించారు. గ్రామానికి చెందిన దువ్వూరు కుమారస్వామి రెడ్డి, సన్నారెడ్డి విజయమోహన్‌రెడ్డి, లోకనాథ రెడ్డి సోదరులు, చిల్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరుల సారధ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతగా నిర్వహించినట్లు తెలిపారు.

కండలేరులో 51.231 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 51.231 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

అధినేతను కలిసిన చిందేపల్లి



అధినేతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిందేపల్లి

పెళ్లకూరు: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగనన్నను కలిసి పుష్పగుచ్ఛం అందించినట్లు తెలిపారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఈబీసీ రుణాలు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 271 మంది లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా 160 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు, రుణాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలను బ్యాంకు సిబ్బంది పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు 52 యూనిట్లు మంజూరు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలియజేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం నెల్లూరు నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ వైద్యులు పి.కావ్యశ్రీ, రేణు మౌనిక, అపూర్వ, ప్రత్యూష పాల్గొన్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో రోగులు విచ్చేశారు. సర్పంచ్ వెందోటి శారద, ఉప సర్పంచ్ శివకుమార్ హాజరయ్యారు.

వైద్యశాలలో మెరుగైన వసతులు

రాపూరు: ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వసతులు కల్పిస్తామని డాక్టర్ సరస్వతి తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల్లో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్యశాలకు అవసరమైన వసతులపై కమిటీ చర్చించిందన్నారు. రోగికి సంబంధించిన హెల్త్ రికార్డులను తయారు చేయడం, వైద్యశాలలో మౌలిక వసతులు కల్పించడం, అవసరమైన పరికరాలు కొనుగోలు చేయడం తదితర సమస్యలు గుర్తించామన్నారు. కమిటీ సభ్యులు డాక్టర్ గజవేణుగోపాల్, గురుమూర్తి, భవాని, ధనలక్ష్మి, మారుతమ్మ, ప్రశాంతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సైదాపురం: మండలంలోని చాగణం సమీపంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో దాడిశెట్టిపల్లి గ్రామానికి చెందిన దేశబోయిన వెంకటరమణయ్య(48) తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటరమణయ్యను మెరుగైన చికిత్స కోసం బంధువులు నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మళ్లీ తిరుపతి ఆస్పత్రికి తరలించారు. తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటరమణయ్య మృతి చెందినట్లు గురువారం సైదాపురం పోలీసులకు వైద్యులు సమాచారమిచ్చారు. దీంతో కేసును నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెళ్లకూరు: మండలంలోని చవటకండ్రిగ గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇలుపూరి నందగోపాల్(22) తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం.. అక్కగారిపేట గ్రామానికి చెందిన నందగోపాల్ ఫిబ్రవరి 28న మేనకూరు సెజ్ పరిశ్రమలో విధులు ముగించుకొని మోటారు బైక్‌పై తిరిగి స్వగ్రామం వెళుతున్నాడు. మార్గ మధ్యంలో చవటకండ్రిగ గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సలు నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు పక్కన మహిళ మృతదేహం

చిల్లకూరు: పోలీస్ స్టేషన్‌కు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉండడాన్ని అటు వైపుగా వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని వివరాలను సేకరించేందుకు ప్రయత్నించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో ఆమె మృతదేహాన్ని గూడూరు ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి వయస్సు సుమారు 40–45 మధ్య ఉంటుందని ఎవరైనా గుర్తించినట్లయితే 9440796347కి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆరు కేంద్రాల్లో పది పరీక్షలు

కోట: పదో తరగతి పరీక్షల కోసం మండలంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ–2 మస్తానయ్య గురువారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కోట బాలుర, బాలికల జెడ్పీ హైస్కూళ్లు, బీసీ, ఎస్సీ గురుకుల పాఠశాలలు, విద్యానగర్ బాలభారతి, చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 819 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మనోహర్‌ను పరామర్శిస్తున్న నేదురుమల్లి



డక్కిలి: భాస్కర్‌నాయుడును పరామర్శిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మసులాలాపేటకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు సజ్జామనోహర్ రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకుని మనోహర్ ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన రుద్రయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారి నివాసం వద్దకు చేరుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన పాత్రికేయుడు చిరంజీవి తండ్రి పాయసం వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. చిరంజీవి నివాసం వద్దకు నేదురుమల్లి చేరుకుని వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. బలుమూరువారి వీధిలోని వైఎస్‌ఆర్ సీపీ నాయకులు అంకయ్య భార్య కమలమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి నివాసం వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామతులసి, నాయకులు కృష్ణయ్య, యస్దానిబాషా తదితరులు పాల్గొన్నారు.

డక్కిలిలో...

డక్కిలి: మండలంలోని డీఉప్పరపల్లి (గొల్లపల్లి) గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు బొల్లినేని భాస్కర్‌నాయుడు తండ్రి సిద్ధయ్య నాయుడు ఇటీవల మృతి చెందాడు. గురువారం డీఉప్పరపల్లిలో జరిగిన ఉత్తరక్రియలకు నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యాడు. సిద్ధయ్యనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొలిగర్ల మస్తాన్ యాదవ్, మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి, పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, సన్నిబోయిన ఈశ్వరయ్య, శ్రీహరిరెడ్డి, బండి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తాం

కోట: కొత్తపట్నం పంచాయతీలో పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. గురువారం కొత్తపట్నంలో గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయమై రైతులతో చర్చించారు. ఎకరా భూమికి రూ.8 లక్షలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కొత్తపట్నం పంచాయతీలోని తొమ్మిది గ్రామాల్లో 365 ఎకరాల భూమిలో 213 మంది రైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అర్హుల జాబితాను గ్రామసభలో ప్రకటించారు. జాబితాపై అభ్యంతరాలు ఉన్న వారు ఏడు రోజుల వ్యవధిలో ఫిర్యాదు చేస్తే పరిశీలించి, న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాలయ్య, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్‌రెడ్డి, తహశీల్దార్ జయజయరావు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

వధూవరులకు నేతల ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి



భూమన కరుణాకరరెడ్డితో మాటామంతి

సైదాపురం: రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు రెండో కుమారుడు నక్కా సుమంత్, శుభశ్రీ వివాహ కార్యక్రమానికి ఉమ్మడి తిరుపతి జిల్లా వైఎస్‌ఆర్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వెంకటగిరిలోని ఎస్‌ఆర్‌ఎల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

2027లోనే జమిలి ఎన్నికలు

- ఆ ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీ చరిత్ర సృష్టించబోతోంది
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన నేదురుమల్లి



గజమాలతో సత్కరిస్తున్న నేతలు

సైదాపురం: 2027లోనే రాష్ట్రంలో జమిలి ఎన్నికలు రాబోతున్నాయని వైఎస్‌ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. అనంతరం డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి, సైదాపురం మండలాలకు చెందిన కా ర్యకర్తలు, నాయకుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వ పాలనపై ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. కూట మి ప్రభుత్వం అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జమిలి ఎన్నికలు రావడం తథ్యమని ఆ ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. కూట మి ప్రభుత్వం గెలిచి తొమ్మిది నెలలైనా ఇప్పటి వరకు ఏ సంక్షేమ పథకం పేదలకు అందలేదన్నా రు. డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు ఎందుకు ప్రారంభించలేదో జవాబు చెప్పాలన్నారు. ప్రస్తుత అరాచక పాలనకు కార్యకర్తలు, నాయకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి నాయకులు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడంపై ప్రజలంతా ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. వైఎస్‌ఆర్ సీపీ అనుబంధ విభాగాల్లో నియోజకవర్గ స్థాయి పదవులు పొందిన నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, బాలాయపల్లి, డక్కిలి కన్వీనర్లు వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, సుబ్బారావు, వహిద, యువజన విభాగం నియోజవర్గ నాయకుడు శ్రీనివాసరాజు, అల్లం సాయి, పేచీ రాజ్, దశరథరామిరెడ్డి, సతీష్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు రాక్షస పాలనలో ప్రజలకు కష్టాలు



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి



కామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

- వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు రాక్షస పాలనలో రాష్ట్ర ప్రజలంతా అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం చిల్లకూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు ఏడాదికి రూ.79,867 కోట్లు అవసరమైనప్పటికీ కేవలం రూ.17,179 కోట్లు మాత్రమే కేటాయించి ప్రజలను మోసగించారన్నారు. జీడీనెల్లూరు బహిరంగ సభలో వైఎస్‌ఆర్ సీపీ వాళ్లకు ఏ పథకాలు ఇవ్వొద్దని, ఏ పనులు చేయొద్దని సీఎంగా ఉంటూ చెప్పడం సిగ్గు చేటన్నారు. తొమ్మిది నెలల కూటమి పాలనలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అనే విషయాన్ని అన్నీ వర్గాల ప్రజలు గ్రహించారని వివరించారు. అన్నదాత సుఖీభవ, దీపం పథకం, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను నీరుగార్చారని ఆరోపించారు.

క్రమశిక్షణకు పట్టం కట్టారు

కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం వైఎస్‌ఆర్ సీపీలో క్రమశిక్షణకు పట్టం కట్టడమేనని పెళ్లకూరు మండల నాయకులు తెలిపారు. చిల్లకూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారంతా కామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. వైఎస్‌ఆర్ సీపీ బలోపేతం కోసం క్రమశిక్షణతో అహర్నిశలు పాటుపడుతున్న కామిరెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన్ను గజమాలతో సత్కరించారు. నాయకులు హరిబాబురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, చంద్రారెడ్డి, జయరామయ్య, రమణయ్య, రవి, రాహుల్, చైతన్య, కోటి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించాలి



నోటి క్యాన్సర్‌పై స్క్రీనింగ్ పరీక్షలు

చిల్లకూరు: క్యాన్సర్ వ్యాధిని స్క్రీనింగ్ ద్వారా తొలి దశలోనే గుర్తించే వీలుంటుందని స్విమ్స్ వైద్యులు తెలిపారు. మండలంలోని చింతవరం పీహెచ్‌సీ పరిధిలోని తిక్కవరం, ఏరూరు గ్రామాల్లో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం పింక్ బస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, గుర్తించిన వారికి చికిత్స అందించేలా చేస్తుందన్నారు. అనంతరం మహిళలకు స్విమ్స్ వైద్యులు నోటి క్యాన్సర్, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేశారు. చింతవరం వైద్యులు సుమ, స్విమ్స్ మెడికల్ అధికారులు డాక్టర్ చైతన్య భాను, హరిత, తిక్కవరం సర్పంచ్ ఓడూరు సత్యనారాయణరెడ్డి, పూడిపర్తి ప్రవీణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పద్మజ, సుబాషిణి, ఉడతా శీనయ్య, వైద్య సిబ్బంది కోటేశ్వరమ్మ, సురేష్, మౌనిక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నదీ గర్భాన్ని నాశనం చేసేస్తున్నారు



స్వర్ణముఖి నదీ గర్భంలోకి వేసిన గ్రావెల్ రోడ్డు

పెళ్లకూరు: కలవకూరు గ్రామం వద్ద స్వర్ణముఖి నదీ గర్భాన్ని నాశనం చేసేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇసుకరీచ్ రద్దు చేయాలంటూ మూడు రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారు. స్థానికులకు స్వర్ణముఖి నది తాగు, సాగునీటికి ప్రధాన ఆధారం. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో ఉన్న స్వర్ణముఖి నదిలో గూడలి, కలవకూరు గ్రామాల వద్ద ఇసుక రీచ్‌లను మంజూరు చేసింది. ఇసుక రీచ్‌లను కైవసం చేసుకున్న కాంట్రాక్టర్లు కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిలోకి వాహనాల రాకపోకల కోసం గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కలవకూరు, పుల్లూ రు, చింతపూడి గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు ఇసుక రీచ్ రద్దు చేయాలంటూ ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ మోటార్ల సమీపంలో ఇసుక తవ్వేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం



ఉపాధ్యాయులు లేక పోవడంతో మన్నేగుంట ప్రాథమిక పాఠశాలలో ఆరుబయట విద్యార్థులు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఇష్టారాజ్యంగా బోధనలు సాగుతున్నాయి. మన్నెగుంట ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. వీరిద్దరూ సెలవు పెట్టడంతో విద్యాశాధికారులు సమీపంలో ఉన్న కొమరావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ వేశారు. అయితే ఆయన గ్రామంలోని ఓ యువతిని భోదన చేయాలని చెప్పి పాఠశాలలో లేకుండా పోయారు. దీంతో పాఠశాలలో విద్యార్థులు తమ ఇష్టం వచ్చినట్లు ఆడుకుంటూ కనిపించారు. విషయాన్ని ఎంఈఓ సనత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా విషయం తెలుసుకుని చర్యలు చేపడుతామని తెలిపారు.